సీఎం రేవంత్‌రెడ్డికి శుభాకాంక్షలు

మలక్‌పేట, జూన్ 6: రాష్ట్రంలో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ఎనిమిది స్థానాలు గెలిచిన సందర్భంగా టీపీసీసీ సెక్రటరీ చెకోలేకార్ శ్రీనివాస్ సీఎం రేవంత్‌రెడ్డిని గురువారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

డీకే అరుణకు అభినందనలు

మలక్‌పేట, జూన్ 6: పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గ సభ్యురాలిగా గెలుపొందిన డీకే అరుణకు పలువురు బీజేపీ నాయకులు అభినందనలు తెలిపారు. బీజేపీ భాగ్యనగర జిల్లా ప్రధాన కార్యదర్శి సందడి సురేందర్ రెడ్డి, మూసారాంబాగ్ డివిజన్ అధ్యక్షుడు కొప్పుల దినేశ్ గురువారం నాంపల్లిలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో అరుణను కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.

ఎల్వోసీ అందజేత

ఉప్పల్, జూన్ 6: ఉప్పల్ డివిజన్ గణేష్‌నగర్‌కు చెందిన రాజ్యలక్ష్మి అనారోగ్యంతో చికిత్స కోసం సీఎం సహాయనిధి కోసం దరఖాస్తు చేశారు. సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన రూ.2.5 లక్షల ఎల్‌ఓసీ పత్రాన్ని గురువారం వారి కుటుంబసభ్యులకు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి పరమేశ్వర్‌రెడ్డి అందజేశారు.

బడీడు పిల్లలను బడిలో చేర్పించాలి

మహేశ్వరంలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంఈవో కృష్ణయ్య

బడంగ్‌పేట, జూన్6: ప్రభుత్వ పాఠశాలలో తమ పిల్లలను చేర్పించాలని ఎంఈవో కృష్ణయ్య విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు. మహేశ్వరం నియోజక వర్గంలోని మహేశ్వరం మండలంలో, బాలాపూర్ మండలంలో, సరూర్‌నగర్ మండలంలో జయశంకర్ సార్ బడి బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని ఆయన తెలిపారు. మొదటి రోజు కార్యక్రమంలో భాగాంగా బాలాపూర్, సరూర్‌నగర్, మహేశ్వరం మండలాల పరిధిలో ఉన్న అన్ని ప్రభుత్వ జడ్పీ హెచ్‌ఎస్‌లో, ప్రాథమిక పాఠశాలలో ర్యాలీలు నిర్వహించి ప్రతిజ్ఞ చేయించామన్నారు. అంగన్ వాడీ టీచర్లతో సమావేశం ఏర్పాటు చేశామని తెలిపారు. అంగన్ వాడీలతో సమావేశం, ర్యాలీలు, ప్రతిజ్ఞ చేశారు. ప్రభుత్వ పాఠశాలలో అనుభవజ్ఞులైన క్వాలిఫైడ్ టీచర్లతో విద్యా బోధన చేస్తారన్నారు. విశాలమైన తరగతి గదులు, ప్రశాంతమైన వాతావరణంలో విద్యాబోధన ఉంటుందన్నారు. ప్రత్యేక తరగతులతో పాటు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం జరుగుతుందన్నారు. ఉచితంగా పాఠ్యపుస్తకాలు, 2 జతల యూనిఫామ్స్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఉచితంగా మధ్యాహ్న భోజనం ఉంటుందన్నారు. మనోవికాస అభివృద్ధికి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. సైన్స్ ప్రయోగ శాల సౌకర్యం ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ , బీసీ విద్యార్థులకు స్కాలర్ షిప్ సౌకర్యం ఉందన్నారు. పుస్తకాలు ఉచితంగా ఇవ్వడం జరుగుతుందన్నారు. పాఠశాలలో మౌలిక సమస్యలు లేకుండా చూస్తామన్నారు. మొదటి రోజు బాలాపూర్ మండలం కొత్తపేట ప్రభుత్వ పాఠశాలలో 18 మంది ఎన్‌రోల్‌మెంట్ చేయించుకున్నట్లు ప్రధానోపాధ్యాయులు అమర్‌నాథ్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అంగన్ వాడీ టీచర్లు తదితరులు ఉన్నారు.

కందుకూరులో...

కందుకూరు: బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంపీడీవో సరిత తెలిపారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా గురువారం మండల పరిధిలోని లేమూరులో జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు నర్సింహచారి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముందుగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని తల్లి తండ్రులను కోరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు చెప్పారు. పాఠశాలకు దూరమవుతున్న పిల్లలను గుర్తించి వెంటనే పాఠశాలలో చేర్పించడానికి కృషి చేయాలని కోరారు.విద్యార్థులకు పుస్తకాలు, దుస్తులను ప్రభుత్వం ఉచితంగా అందజేస్తుందని పేర్కొన్నారు.



కొత్తపేటలో బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న ప్రధానోపాధ్యాయుడు అమర్‌నాథ్ రెడ్డి

లేమూరులో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీవో సరిత

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

హయత్‌నగర్, జూన్ 6 : పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషిచేయాలని హయత్‌నగర్ కోర్టు జడ్జిలు సల్మా ఫాతిమా, సంకేత్ మిత్ర అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం హయత్‌నగర్ కోర్టు ఆవరణలో హయత్‌నగర్ కోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జడ్జిలు సల్మా ఫాతిమా, సంకేత్ మిత్ర హాజరై మాట్లాడుతూ మొక్కలు నాటి భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలువాలన్నారు. ఈ కార్యక్రమంలో హయత్‌నగర్ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ అరుణోదయ కుమార్, బార్ అసోసియేషన్ నాయకులు, సీనియర్ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న జడ్జిలు సల్మా ఫాతిమా, సంకేత్ మిత్ర

లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలి

మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి

ఆర్కేపురం, జూన్ 6: జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి అన్నారు. గురువారం న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ న్యూ ఢిల్లీ, తెలంగాణ న్యాయ సేవాధికార సంస్థ, హైదరాబాద్ వారి ఆదేశాల మేరకు శనివారం రంగారెడ్డి జిల్లాలోని అన్ని కోర్ట్‌లలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇదివరకు కోర్టు ముందుకు రాని కేసులు కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులు పరిష్కరించుకునేందుకు, రాజీ చేసుకునే వేదిక ఈ లోక్ అదాలత్ అని అన్నారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో రాజీకి పడదగ్గ క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు, కుటుంబ తగాదా కేసులు, డబ్బు రికవరీకి సంబంధించిన కేసులు మోటర్ వెహికల్ యాక్సిడెంట్ కేసులు, చిట్ ఫండ్ కేసులు, ఎలక్ట్రిసిటీ కేసులు, చెక్కు బౌన్స్ కేసులు, ఇతర రాజీకి వీలున్న కేసులు సులభంగా పరిష్కరించుకోవచ్చని చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బాలసుబ్రహ్మణ్యంకు ఘన నివాళి

బాలసుబ్రహ్మణ్యం చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న మాళవిక, మార్గం రాజేశ్

ఆర్కేపురం, జూన్ 6 : దివంగత ప్రఖ్యాత గాయకుడు పద్మ విభూషణ్ ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యం 78వ జయంతిని పురస్కరించుకొని ఎస్.పి.బి.సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ వ్యవస్థాపకులు శృంగారం గోవింద్ ఆచార్య, చెన్ను హరే రాము నిర్వహణలో ఎల్బీనగర్‌లోని అనాథ విద్యార్థి గృహంలో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జయంతి వేడుకలను నిర్వహించారు. ప్రముఖ సినీ నేపథ్య గాయని, గాయకులు హాజరై బాలసుబ్రహ్మణ్యం పాటలు పాడి విద్యార్థులను ప్రేక్షకులను అలరించారు. అనంతరం విద్యార్థులకు విందు భోజనం ఏర్పాటు చేసి వివిధ కోర్సుల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాళవిక, అనాథ విద్యార్థి గృహం అధ్యక్షుడు మార్గం రాజేశ్, కమిటీ సభ్యులు కృష్ణవేణి, శ్రీనివాస్, దైవజ్ఞశర్య, రావూరి మాధవి, శ్రీదేవి, బ్లిస్ శ్రీనివాస్, కిశోర్ దాస్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ హత్య కేసులో ముగ్గురి అరెస్టు

బడంగ్‌పేట,జూన్6: మహిళను హత్య చేసిన ఘటనలో ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు మీర్‌పేట సీఐ కాశీ విశ్వనాథ్, ఎస్ఐ గోవింద్ స్వామి తెలిపారు. బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వినాయక హిల్స్‌కు బుధవారం మధ్యాహ్నం మహేశ్వరం మండలం కేసీ తండాకు చెందిన ప్రభు, శాంతి దంపతులు తన కూతురు స్వాతిని చూడటానికి వచ్చారు. స్వాతికి అత్త లలితతో తరుచు గా గొడవలు జరుగుతున్నాయని మాట్లాడటానికి వచ్చారు. మాట మాట పెరిగి గొడవకు దారి తీసింది. కాగా ప్రభు లలితను నెట్టి వేయడంతో ఆమె కింద పడిపోగా పక్కనే ఉన్న సుత్తెతో కొట్టడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేశారు. దీంతో లలిత కుమారుడు జయరాం బంధువులతో కలిసి పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి ప్రభు, శాంతి, స్వాతిలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

చిన్నపాటి వర్షానికే మురుగునీటి సమస్యలు

భవానీనగర్ కాలనీలో సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

మన్సూరాబాద్, జూన్ 6: చిన్నపాటి వర్షాలకే లోతట్టు కాలనీల్లో మురుగునీటి సమస్యలు తలెత్తుతున్నాయని మన్సూరాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి తెలిపారు. మన్సూరాబాద్ డివిజన్ పరిధి భవానీనగర్, శ్రీరామహిల్స్‌కాలనీ, గణేశ్‌నగర్ ఫేజ్-1లో గురువారం ఉదయం మార్నింగ్ వాక్ నిర్వహించిన ఆయన మురుగునీటి సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ గణేశ్‌నగర్ ఫేజ్-1లో చేపట్టిన స్మార్ట్ వాటర్ డ్రైన్ పనులు నత్తనడకన సాగుతుండటం వలన చిన్నపాటి వర్షానికే కాలనీ మురుగునీటితో నిండిపోయిందన్నారు. సదరు పనులను త్వరితగతిన పూర్తి చేసి కాలనీవాసుల ఇబ్బందులను తొలగించాలన్నారు. పలు శాఖలకు చెందిన అధికారులు సమన్వయంతో పని చేస్తూ విజయవాడ జాతీయ రహదారి పనులను వేగంగా పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు సత్యనారాయణ, పద్మారావు, రాజశేఖర్, జైపాల్‌రెడ్డి, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

జన్మదిన శుభాకాంక్షలు

ఎల్బీనగర్ , జూన్ 6: గడ్డిఅన్నారం మున్సిపాలిటీ మాజీ వైస్‌చైర్మన్, కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయ కమిటీ మాజీ చైర్మన్, తెలంగాణ గౌడ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చేగోని సుదర్శన్ గౌడ్ జన్మదిన వేడుకలను గడ్డిఅన్నారం డివిజన్ కమలానగర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీల నాయకులు, గౌడ సంఘాల ప్రతినిధులు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు చేగోని సుదర్శన్ గౌడ్‌ను శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు బేర బాలకిషన్, మద్దెల సునీల్‌బాబు, కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయం ట్రస్టు బోర్డు సభ్యుడు బబ్బురి ఆనంద్‌కుమార్ గౌడ్, గడ్డిఅన్నారం గౌడ సంఘం చీఫ్ ప్రమోటర్ రాజలింగం గౌడ్, రామాంజనేయులు గౌడ్, వెంకట్‌రెడ్డి, మార్గం శ్రీనివాస్, రాములు తదితరులు పాల్గొని సుదర్శన్ గౌడ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సుదర్శన్ గౌడ్‌ను కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయం అర్చకులు ఆశీర్వదించారు.

ఈఎంఈ సెయిలింగ్ పోటీలు ప్రారంభం

సిటీబ్యూరో, జూన్ 6(నమస్తే తెలంగాణ)/ హైదరాబాద్, ఆట ప్రతినిధి: ఆర్మీకి చెందిన ఈఎమ్‌ఈ వార్షిక సెయిలింగ్ రెగెట్టా చాంపియన్‌షిప్ పోటీలు షురూ అయ్యాయి. ద క్రాప్స్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ మెకానికల్ ఇంజినీర్స్ (ఈఎంఈ) సెయిలింగ్ క్లబ్ ఆధ్వర్యంలో హుస్సేన్ సాగర్‌లో సెయిలింగ్ పోటీలను లెఫ్టినెంట్ జనరల్ నీరజ్ వర్ధన్‌నాయ్ ప్రారంభించారు. సెయిలింగ్ క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో క్రాప్స్ ఆఫ్ ఈఎంఈ సెయిలింగ్ రెగెట్టా – 2024 పోటీల వివరాలను వెల్లడించారు. ఈ టోర్నీలో దేశంలోని వివిధ ఆర్మీ యూనిట్లకు చెందిన సెయిలర్లు పోటీపడుతున్నారు. రెగెట్టా టోర్నీలో రాణించడం ద్వారా భవిష్యత్‌లో ఆర్మీ యాచింగ్‌లో శిక్షణతో పాటు జాతీయ, అంతర్జాతీయ స్థాయి టోర్నీల్లో దేశం ప్రాతినిధ్యం వహించేందుకు అవకాశం లభించనుంది. సెయిలింగ్ ద్వారా టీమ్ వర్క్ అభివృద్ధి చెందడంతో పాటు ఆలోచన విధానం మారుతుందని నీరజ్ పేర్కొన్నారు.

అన్నదానం

అన్నదానం చేస్తున్న ఆర్యవైశ్య సంఘం సభ్యులు

చంపాపేట, జూన్ 6: అన్నదానం చేసే ప్రతి ఒక్కరికీ ఎంతో ఆత్మసంతృప్తి కలుగుతుందని ఆర్యవైశ్య సంఘం చంపాపేట డివిజన్ కమిటీ ప్రధాన కార్యదర్శి బచ్చు మహేశ్ గుప్త అన్నారు. చంపాపేట ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ప్రతి అమావాస్య రోజు చేపడుతున్న అన్నదాన వితరణలో భాగంగా గురువారం అమావాస్య సందర్భంగా చంపాపేటలోని ఆర్యవైశ్య సంఘం కార్యాలయం ఎదుట వారు అన్నదాన వితరణ చేశారు. సుమారు 600 మందికి అన్న ప్రసాద వితరణ చేశారు. అనంతరం బచ్చు మహేశ్ గుప్త మాట్లాడుతూ అన్నదానం చేసే ప్రతి ఒక్కరికీ ఎంతో ఆత్మసంతృప్తి కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అమావాస్య అన్నప్రసాద వితరణ కమిటీ అధ్యక్షుడు డుపుల విజయనాథ్‌గుప్త, చంపాపేట ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఊరె రవీందర్ గుప్తా, సంఘ సభ్యులు ఊరె మధుసూదన్‌గుప్త, జగన్‌గుప్తా, చీకటిమల్ల లోకేశ్‌గుప్తా, ముప్పారపు బాల్‌రాజ్‌గుప్తా పాల్గొన్నారు.

చంపాపేటలో...

చంపాపేట: ప్రతి అమావాస్య రోజు శ్రీ మాతా అన్నపూర్ణేశ్వరి అన్నదాన ట్రస్ట్ ఆధ్వర్యంలో చంపాపేట లోని పోచమ్మ ఆలయం ఎదురుగా ఉన్న చౌకధరల దుకాణం ముందు నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణలో భాగంగా ట్రస్ట్ ఆధ్వ ర్యంలో గరువారం అమా వాస్య సంద ర్భంగా సుమారు 400 మందికి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ భగవాన్‌జీ, రవిముదిరాజ్, రాదే కుమార్, సుశీల్‌కుమార్, సంతోష్ లడ్డా, ప్రవీణ్, వెంకటేశ్, చింటూ, రాజు, శాన్వాస్, అండేకార్ వెంకటేశ్, శ్రీనివాస్, రాజేశ్ టింగ్‌లికర్, కర్నాటి మనోహర్ నేత, సాయి, రమేశ్‌ముదిరాజ్, శ్రీనునాయక్, చందు పాల్గొన్నారు.

పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా చూడాలి

భగత్‌సింగ్‌నగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ ఆకుల శ్రీవాణిఅంజన్

ఆర్కేపురం, జూన్ 6 : డివిజన్ పరిధిలో పారిశుధ్యం లోపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణిఅంజన్ అధికారులకు సూచించారు. గుడ్‌మార్నింగ్ సరూర్‌నగర్ మార్నింగ్ వాక్‌లో భాగంగా గురువారం శానిటైజేషన్ డిపార్ట్‌మెంట్ డీఈ నీలిమ, వర్క్ ఇన్‌స్పెక్టర్ బుచ్చయ్య, ఎస్ఎఫ్ఏ శ్రీనివాస్, సత్య, హెచ్ ఎండబ్ల్యూఎస్ ఎస్‌బీ సూపర్‌వైజర్‌తో కలిసి కార్పొరేటర్ శ్రీవాణి అందజన్ భగత్‌సింగ్‌నగర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో కాలనీల్లో పారిశుధ్య సమస్యలు లోపించకుండా ఎప్పటికప్పుడు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఎప్పటికప్పుడు చెత్తను తరలించాలని, అదే విధంగా డ్రైనేజీ సమస్య ఏర్పడకుండా చూడాలన్నారు. పారిశుధ్య సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించేందుకు అధికారులతో కలిసి మార్నింగ్ వాక్ చేపట్టనున్నట్లు తెలిపారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షురాలిగా శృతి

నూతన కమిటీ నాయకులను సన్మానిస్తున్న అసోసియేషన్ సభ్యులు

వనస్థలిపురం, జూన్ 6 : తెలంగాణ రాష్ట్ర వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షురాలిగా శృతి ఎన్నికయ్యారు. గురువారం వనస్థలిపురంలో జరిగిన అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశంలో ఆమెను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శృతి మాట్లాడుతూ రాష్ట్రంలో వెయిట్ లిఫ్టింగ్‌ను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. క్రీడపై రాష్ట్ర వ్యాప్తంగా అవగాహన, శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. మారుమూల ప్రాంతాల్లో ఉన్న క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహిస్తామన్నారు. ప్రతి జిల్లా నుంచి 5 మంది క్రీడాకారులను జాతీయ స్థాయికి తీసుకువెళ్లేందుకు కృషి చేస్తామన్నారు. ప్రధాన కార్యదర్శి వెంకటరమణ, కోశాధికారి సైదులు పాల్గొన్నారు.

షాపు ఖాళీ చేయాలని దౌర్జన్యం

వస్తువులు బయటపడేసిన దృశ్యం

వనస్థలిపురం, జూన్ 6 : అద్దెకు ఉంటున్న షాపు ఖాళీ చేయాలని 20మంది వ్యక్తులు షాపు నిర్వాహకులపై దాడి చేయడంతోపాటు, అందులో ఉన్న వస్తువులు బయట పడేసిన సంఘటన వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. వైదేహినగర్ శివసింధు చౌరస్తాలో పుష్ప అనే మహిళ సాయితేజ ఫుట్ వేర్ పేరుతో చెప్పుల షాపు నిర్వహిస్తోంది. ఆ షాపు మడిగ యజమాని గత ఫిబ్రవరిలో షాపు ఖాళీ చేయాలని చెప్పాడు. ఇప్పటికిప్పుడు ఖాళీ చేయాలంటే తమకు మరోచోట స్థలం దొరకాలని బాధితులు తెలిపారు. దీంతో ఇరువురి మధ్య వివాదం కావడంతో పెద్ద మనుషుల మధ్యన మాట్లాడి ఆగస్టు తర్వాత ఖాళీ చేస్తామని ఒప్పందానికి వచ్చారు. కానీ గురువారం సాయంత్రం మడిగ యజమాని 20 మందిని తీసుకుని వచ్చి పుష్పతోపాటు ఆమె కుటుంబ సభ్యులపై దాడి చేశారు. షాపులో ఉన్న చెప్పులను రోడ్డుపై పడేశారు. తమపై దౌర్జన్యం చేస్తున్నారని వారం క్రితం పోలీసులకు ఫిర్యాదు చేశామని బాధితులు పేర్కొన్నారు. షాపు నడుస్తేనే తమ కుటుంబానికి ఆధారమని, తమను రోడ్డుమీద పడేశారని బాధితురాలు పుష్ప రోధించింది. మహిళలు అని కూడా చూడకుండా తనపై, తన కూతురుపై విచక్షణ రహితంగా దాడిచేశారని వాపోయారు. స్థానికుల సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు దాడి చేసిన వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. మహిళలపై దాడిచేసిన వ్యక్తులపై కఠిన చర్యలు బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బీసీపీఎల్‌లో పవర్‌హిట్టర్స్ విజయం

హైదరాబాద్, ఆట ప్రతినిధి: అత్తాపూర్‌లోని స్ట్రైయిట్ డ్రైవ్ వేదికగా జరిగిన బాక్స్ క్రికెట్ ప్రీమియర్ లీగ్(బీసీపీఎల్)లో పవర్ హిట్టర్స్ టీమ్ విజేతగా నిలిచింది. గురువారం జరిగిన ఫైనల్లో పవర్ హిట్టర్స్..పూర్‌బాయ్స్‌పై ఘన విజయం సాధించింది. తొలుత పూర్‌బాయ్స్ 7 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 40 పరుగులు చేసింది. తర్వాత లక్ష్యఛేదనకు దిగిన పవర్‌హిట్టర్స్ 6.5 ఓవర్లోనే విజయాన్నందుకుంది. సూపర్ బౌలింగ్‌తో ఆకట్టుకున్న శంకర్‌సింగ్ రాజ్‌పుత్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. ముగింపు కార్యక్రమానికి అజయ్‌కుమార్ అగర్వాల్, అమ్రిత్ కుమార్, అరుణ్‌కుమార్, వేద్‌ప్రకాశ్ హాజరయ్యారు.

డీకే అరుణకు శుభాకాంక్షలు

కందుకూరు, జూన్ 6 : జిల్లా అభివృద్ధి కి కృషి చేస్తామని బీజేపీ నుంచి విజయం సాధించిన ఎంపీలు గంగాపురం కిషన్‌రెడ్డి, డీకే అరుణ, ఈటల రాజేందర్, కొండ విశ్వేశ్వర్‌రెడ్డి, బూర నర్సయ్యగౌడ్, బండి సంజయ్, రఘునందన్‌రావు, ధర్మపురి అరవింద్ తెలిపినట్లు రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి తెలిపారు. విజయం సాధించిన అనంతరం ఆయన వారి నివాస గృహాలకు వెళ్లి శుభాకాంక్షలు తెలిపిన అనంతరం శాలువాలతో సన్మానించి స్వీట్లను తినిపించారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకునే విధంగా కృషి చేయాలని వారు చెప్పినట్లు వివరించారు. జిల్లా నాయకులు పాపయ్య గౌడ్, సుదర్శన్‌రెడ్డి, అంజన్‌కుమార్ గౌడ్‌లు నాయకులు పాల్గొన్నారు.

అన్నదానం

ఎల్బీనగర్ , జూన్ 6: కొత్తపేట డివిజన్ మోహన్‌నగర్‌లో గురువారం శ్రీరామ సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి నెల అమావ్యాస సందర్భంగా అన్నప్రసాద వితరణ కార్యక్రమం సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్ పాల్గొని అన్నప్రసాదాన్ని వడ్డించారు. నాయకులు ఉపేందర్ సింగ్, సుందర్‌నారాయణ, ప్రవీణ్, శ్రీనివాస్, సాయి పాల్గొన్నారు.

తాగునీటిని సరఫరా చేయాలి

చర్లపల్లి, జూన్ 6 : చర్లపల్లి డివిజన్ పరిధిలోని పలు కాలనీలకు తాగునీటి సరఫరాలో హెచ్చుతగ్గులతో పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చర్లపల్లి కాలనీల సమాఖ్య ప్రతినిధి ఎంపెల్లి పద్మారెడ్డి పేర్కొన్నారు.